
# స్వయంప్రభ

**“కుటుంబం తాలూకు పరువుప్రతిష్ఠలతో నీకు పనిలేదు. కొన్ని బాధ్యతలుంటాయి సహజీవనమన్నాక. వాటిని సక్రమంగా నిర్వర్తించాలన్న కమిట్‌మెంట్ లేదు. ప్రతీదానికీ గొడవే!” అని విసుక్కుంటూ వెళ్ళిపోయాడు శ్రీధర్.**

నిజమే! పరువుప్రతిష్ఠల్నీ- బరువు బాధ్యతల్నీ నేనెప్పుడు గుర్తుపెట్టుకున్నాను కనుక. ఇరవైరెండేళ్ళ మా సహజీవనంలో నేను మిగుల్చుకున్న కితాబులివి. ఇంటినిండా బంధువులు. కంటినిండా కన్నీళ్ళు. గుండెనిండా గుబుళ్ళు. ఇప్పుడు నేను చాలా మర్యాదగా ప్రవర్తించాలి. దేన్నీ బయటపడనివ్వకూడదు. కుటుంబానివి కావు పరువుప్రతిష్ఠలు. తనవి. వాటిని నేను రెండు చేతులూ అడ్డుపెట్టి దీపంలా వెలగనివ్వాలి. నిజానికి నేను ఈ రెండు సంవత్సరాలుగా చేస్తున్న పని ఇదే! నా గుండెని చిక్కబట్టుకుని, పళ్ళ బిగువున మాటలు దాచి రగుల్కోడానికి ముందున్న నిప్పులా ఉన్నాను.



కానీ, ఈ సందర్భంలో అతను గుర్తు చేస్తున్న నా బాధ్యతను నేను నిర్వర్తించడానికి సిద్ధంగాలేను. ఎందుకంటే నేను ఆ ఉచ్చులోనే ఇరుక్కున్నాను. దాన్ని పూలదండలా అనుకుని ఎంతో మురిపంగా ధరించాను. వసివాడకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని అనుకున్నాను. ఆ పరిమళపు మత్తులో ఎన్నిటినో కాలదన్నాను. అవి మళ్ళీ తిరిగిరావు. ఇంతా జరిగాక చూస్తే పూలదండ ఒడిలి, వాడు వాసన వస్తోంది. వాడడం సహజమే! అది అలాకాకూడదన్న నా కోరికే అసహజం. అందుకే నా చిన్ని స్నిగ్ధని సహజంగా ఉండనివ్వాలని ఉంది. కానీ స్నిగ్ధ ఇంకా ముగ్ధ. దానికీ దిగితేగాని లోతు తెలియదు.

“అమ్మా! మోహన్ చాలా బ్రిలియంట్. ఎంత మృదువో అతని హృదయం. అతని బుద్ధి అంత సునిశితం. అతనితో మాట్లాడుతోంటే గులాబీ పూల వాన కురిసినట్టుంటుంది.” అంటూ నాకు మోహన్‌ని పరిచయం చెయ్యగానే ఏవో రక రకాల జ్ఞాపకాలు నన్ను ఊపిరి సలుపుకోనివ్వలేదు.

స్నిగ్ధ ఆరునెలల పిల్లగా ఉన్నప్పుడు- ఇంకా పాలు నా దగ్గరే తాగుతున్నప్పుడు శ్రీధర్ కూడానే ప్రతీక్షణం ఉండాలన్న నా ప్రేమ మత్తుని ఎవరు అర్థం చేసుకున్నారు? శ్రీధర్ వెళ్ళిపోతోంటే పాపని అమ్మ దగ్గర వదిలి అతనితోపాటు వచ్చేసాను. సాయంత్రమయ్యేటప్పటికి నా గుండెలు బరువుగా అయిపోయాయి. ఊపిరి తీసుకోవడం కూడా కష్టమయిపోయింది. కొంతసేపటికి “అయ్యో! అనవసరంగా వచ్చేశావురా!” అంటూ మా అమ్మదగ్గరకి తీసుకెళ్ళి దింపేశాడు. ఒక్కరోజన్నా సెలవు ఎక్స్టెంట్ చేసి నా దగ్గర ఆగుతాడేమో అనుకున్నాను. కానీ వెంటనే వెళ్ళిపోయాడు. అతని దూరాన్ని భరించలేని నేను ఒకటే ఏడుపు- ఏడుపు. అమ్మ తిట్లు. “చంటి పిల్లని పట్టించుకోకుండా ఏమిటా పిచ్చి? పాలు తాగే పిల్లని ఒదిలిపెట్టిపోయావు. అర్థముండాలి దేనికైనా” అని. ఇప్పటికీ ఆ సంఘటన గుర్తుకు తెచ్చుకుని శ్రీధర్ “నువ్వేమైనా బండ పిల్లవోయ్! పాపని ఒదలి ఆరోజు నాతో వచ్చేశావు. నీలాంటి ఆడదాన్ని నేను ఎక్కడా వినలేదు- కనలేదు” అని నవ్వుతూ ఉంటాడు. కానీ నాలాంటి వెర్రి వాళ్ళు ప్రపంచంలో చాలామంది ఉండే ఉంటారు.

కాకపోతే శ్రీధరాలకి చూసే చూపే మసకేసిపోతుంది కొన్నాళ్ళకి.

ఇరవైరెండేళ్ళ క్రితం ఇతని తోటి నా జీవితం కోసం, ఈ బంధం మీద గౌరవంతో- ఎంత నిండుగా ఫీల్ అయ్యేనో! ఎన్నిటిని వదులుకున్నానో!

ఎంతో ప్రేమగా పెంచిన మా తాతయ్య ‘మిమ్మల్ని చూడాలని ఉందమ్మదూ, ఇద్దరూ రండి’ అని కబురు చేస్తే- అతనికి కుదరకపోతే నేను వెళ్ళడం మానేశాను. ఆ తరువాత తాతయ్యని చూసే అవకాశమే నాకు లేకుండా దేముడు చేశాక కూడా నేను పెద్దగా పశ్చాత్తాపపడలేదు. నా స్నేహాలన్నీ నాకై నేను వదులుకున్నాను మా ప్రైవసీ దెబ్బతింటుందని- శ్రీధరంతోటి నా జీవనానికి ఏమీ అడ్డుకాకూడదన్న ఆలోచనతో- ప్రతీక్షణమూ నా జీవితంలో అతనికే కావాలన్న వ్యామోహంతో- కానీ వేరువేరు శరీరాలతో ఇద్దరిగా ఉన్న వ్యక్తుల జీవితంలో ఎవరి సమయం వారిదే! ఎవరి జీవితం వారిదే! ఇది తెలుసుకోలేకపోవడం వల్ల ఒకరి జీవితమే మిగులుతుంది. రెండోవారికి జీవితమే లేకుండా పోతుంది. ఈ నిజాన్ని అంగీకరించమంటూ శ్రీధర్ అతని జీవితాన్ని అతను నిర్మించుకుంటూ ముందుకు సాగుతూనే ఉన్నాడు. నేనే అది మా జీవితం అన్న అపోహలో చాలా రోజులున్నాను. అతని కీర్తిప్రతిష్ఠలు నావే అనుకున్నాను వెర్రిగా. ఆ మత్తులోంచి నెమ్మదినెమ్మదిగా బయటకి వచ్చి చూస్తే…

మళ్ళీ మత్తులోకి వెళ్ళిపోవాలన్న ఆకాంక్ష. కానీ ఎంత ప్రయత్నం చేసినా నా బుర్ర పనిచెయ్యకుండా ఉండడానికి- నా బుర్ర ఇప్పుడు ఇరవై నాలుగు గంటలూ పనిచేస్తూనే ఉంటోంది. ఒకటే పేరు అపర్ణ. అపర్ణ అని నా ఆలోచనలో. ఒకటే రూపం. కలలో కూడా! అందుకే స్నిగ్ధ చేసిన మోహన్ పరిచయం విన గానే తుళ్ళిపడ్డాను.

లయన్స్‌క్లబ్బువాళ్ళు కండక్ట్ చేసిన ఒక మీటింగులో అపర్ణని చూశాం. ఆ మీటింగ్‌కి ‘చీఫ్‌గెస్ట్’గా శ్రీధరం వెళ్తూంటే నేనూ వెళ్ళాను. అక్కడ హుషారుగా తిరుగుతూ కనిపించింది అపర్ణ. చాలా లలితంగా ఉంది ఆమె రూపం. మాట ఎంతో సున్నితంగా ఉంది. చాలా నచ్చింది నాకు. శ్రీధరాన్ని అక్కడ చాలామంది గ్రీట్ చేశారు. తరువాత తరుచు అపర్ణ మా ఇంటికి వస్తూ ఉండేది. చాలాప్రేమగా చాలా నిలకడగా ఉండేది. స్నిగ్ధకూ, నాకూ చాలా నచ్చింది. ఎంతో ఇష్టం ఏర్పడింది

ధూళిపాళ అన్నపూర్ణ

మా మధ్యలో. “శ్రీధర్‌గారు ఫోను చేశారు, వచ్చాను.” అని వచ్చి కూర్చుని చాలా సంగతులు మాట్లాడేది. అలా వింటూ పరిశీలిస్తూ కూర్చునేవాడు శ్రీధర్.

కొన్నిరోజుల తరువాత “ఈవిడ నన్ను పట్టుకుని తినేస్తోంది వదలడంలేదు” అనేవాడు. నేను “అలా అసహ్యంగా మాట్లాడకు” అని దెబ్బలాడేదాన్ని. ఆవిడ వచ్చినప్పుడు బయటికి వెళ్ళిపోవచ్చు కదా! వెళ్ళేవాడు కాదు. నాకు అర్థమయ్యేది కాదు. కొన్నిరోజులకు అపర్ణ ఇంటికి రావడం తగ్గించేసింది. స్నిగ్ధ అడిగేది “ఆంటీ రావడం లేదేం అమ్మా!” అని. ఒకటి రెండుసార్లు శ్రీధర్‌తో కలిపి అపర్ణని బయట చూశాను. ‘అనుకోకుండా అపర్ణ బయట కన్పించిందోయ్’ అని అలాంటప్పుడు శ్రీధర్ చెబుతూ ఉండేవాడు.

ఏడాదిన్నర తర్వాత- ఆరోజు నా పుట్టినరోజు. ‘వాళ్ళిద్దరూ పెళ్ళి చేసేసుకున్నారట’ అన్న వార్త నా ముందుకొచ్చింది. అది ఎలా వచ్చిందో కూడా

'కరక్ట్'గా నాకిప్పుడు గుర్తురాదు. కానీ ఎప్పుడూ రకరకాల రూపాలతో ఆ వార్త నా కళ్ళముందుకొస్తూ ఉంటుంది.

"అతని ప్రేమని శాశ్వతం చేసుకోవాలి. అతను లేనిదే నేను నిలవలేను. అందుకే పెళ్ళి చేసుకొమ్మని బలవంత పెట్టి ఒప్పించాను. మంత్రాలఘోషలో- నలుగురైదుగురు బ్రాహ్మల మధ్యలో మేము ఒకటయ్యాం" అని అపర్ణ కజిన్ స్వర్ణమాల చెప్పిన అపర్ణ మాట గుర్తుకువస్తే ఏడుపు వచ్చేవరకు- ఊపిరి ఆగే వరకూ నవ్వాలని అనిపిస్తుంది. కానీ నవ్వూ- ఏడుపూ రెండు దూరమే నాకిప్పుడు. నిజంగా ఇప్పుడు నేను బండపిల్లని. కాదు బండని.

అయినా కూడా నాకు నా పెళ్ళీ- ఆ పెళ్ళిలో చదివిన మంత్రాలూ- నెలరోజులముందునుండే ఆ మంత్రాలన్నింటికీ నేను అర్థం చెప్పించుకుని, ఆ నెలరోజులూ ఆ భావాల్లో మా ఇద్దర్నీ నేను ఊహించుకున్న తీరూ గుర్తుకువస్తున్నాయి. పెళ్ళిలో ఒక్కొక్క సన్నివేశంలోనూ నేను ఉద్వేగపడినతీరూ, ఆ సమయంలో తాతయ్య నెమ్మదిగా వెనకనుండి నన్ను సంయమనపరిచిన సందర్భమూ వేలవేల వర్ణాలతో నా కళ్ళ ముందుకొస్తూ ఉంటుంది. ముహూర్తం పెట్టడం దగ్గరనుండి నేను ఎంత జాగ్రత్తగా ఎంతమందిని అడిగి హెచ్చరించి పెట్టించుకున్నానో ఆ మాటలన్నీ ఉరుముల్లా- మెరుపుల్లా నన్ను దిగ్భ్రాంతి పరుస్తూ ఉంటాయి. అయినా స్నిగ్ధ దగ్గర ఇన్నాళ్ళుగా గంభీరమేఘంలా కదుల్తున్నాను.

కొన్నాళ్ళుగా నా జీవన విధానాన్ని నేను కత్తిమీద సాములా కఠినతరం చేసుకున్నాను. ఆఫీసు- ఇంటిపని ఈ రెండిటి తోనే పరిసమాప్తం చేసుకునే నా సమయాన్ని విశాలపరుచుకుందుకు నేను చేస్తున్న ప్రయత్నం అంత సులువుగా లేదు. నా హృదయం ఈ సమయంలో రక్తం ఒడుతున్న పసిగుడ్డులా ఉంది. అయినా తప్పదు. యోగసాధన సంస్థవాళ్ళు నిర్వహించే క్లాసులకు అటెండ్ అవుతున్నాను. వాళ్ళు చేసే కార్యక్రమాలలో తలమునకలవడానికి ప్రయత్నం మాత్రం చేస్తున్నాను. కానీ నా తల ఇంకా అపర్ణ రూపంవైపే చూస్తోంది. ఇంతలో స్నిగ్ధ పెళ్ళి. అది ఈ సంవత్సరం ఎం.ఏ పరీక్షలు రాస్తుంది. ఈలోపునే మోహన్‌తో దాని పెళ్ళి నిర్ణయం చేశారు వాళ్ళ నాన్నా అదీ కలిసి. నెమ్మదిగా దానితో మాట్లాడి చూసేను.

"మంచి ఫ్యూచర్ ఉందమ్మా మోహన్‌కి" అన్న స్నిగ్ధ మాటకి- అతని ఫ్యూచర్ సరే! నీ ఫ్యూచర్ గురించి నువ్వేమనుకుంటున్నావు? అని నేనడిగితే-

ఇష్టపడి- వివాహబంధంతో ఏకమయ్యే ఇద్దరికి వేరేవేరే ఫ్యూచర్లుండాలంటావా అమ్మా! తన భవిష్యత్తు నాకు భవిష్యత్తునివ్వదా?" అని ప్రేమ తమకంతో మాట్లాడుతున్న దానికేసి చూస్తూ ఉండిపోయాను. యౌవనంలోని జీవన విలాసంతో అది ఉరకలు వేస్తోంది. దాని జీవితానుభవంతోనే అది మార్గనిర్దేశం చేసుకోవాలి. బొగడ పూల సువాసన కమ్మిన మార్గం దానికి కేటాయింపబడి ఉండాలని నా తల్లి మనసు కోరడం మినహా నేను ఏమీ చెయ్యలేకపోయాను.

అయితే ఇప్పుడు పీటపై కూర్చుని తల్లిదండ్రులమై దాని పెళ్ళిచెయ్యాలి. అదీ నా బాధ్యత. ఇరవైరోజుల క్రితమే స్నిగ్ధతోపాటు నాలుగువేల రూపాయల ఖరీదుచేసే కంచిపట్టుచీర కొని తెచ్చాడు. 'ఈ చీరలో స్నిగ్ధ పక్కన నువ్వు రెండవ స్నిగ్ధలా మెరిసిపోతావ్' అంటూ చూపించాడు. ఇలాంటి మాటలు ఒకప్పుడు నన్ను మైకంలో పడేసేవి. కానీ ఇప్పుడు ఆ మాటలు వికారం పుట్టిస్తున్నాయి. కన్నీళ్ళకు బదులు వాంతివచ్చేలా ఉంది నాకు తలుచుకుంటే!

నేనిప్పుడు ఆ చీర ధరించి పీట పైకెక్కి అతనిపక్కన కూర్చుని అతని పరువుప్రతిష్ఠలకు పెట్టనికోటలా ఉండాలి. నావల్ల అది కాదు. అతని పక్కన నా చోటుని నేను మైనస్ చేసుకుని సమంగా ఏడాది అయ్యింది. ఈ ఇంట్లో నా చోటుని అతను మైనస్ చేసుకోనివ్వడు. అపర్ణకు విడాకులు వచ్చాక ఉండడానికి ఆమెకు వేరే ఇల్లు తీసుకుని సిద్ధంగా ఉంచాడు. ఇప్పుడు ఎప్పుడైనా వాళ్ళిద్దరూ అక్కడే కలుసుకుంటూ ఉంటారట. (ఛీ! ఈ ఆలోచన వద్దన్నా పోదు) అతనికి ఎక్కడ వీలుగా ఉంటే అక్కడ ఉంటూ ఉంటాడట. ఇవి నా చెవిలో పడాలని అతను మాట్లాడిన మాటలు.

**నా స్నేహాలన్నీ నాకై నేను వదులుకున్నాను మా ప్రైవసీ దెబ్బతింటుందని- శ్రీధరంతోటి నా జీవనానికి ఏమీ అడ్డుకాకూడదన్న ఆలోచనతో- ప్రతీక్షణమూ నా జీవితంలో అతనికే కావాలన్న వ్యామోహంతో- కానీ వేరు వేరు శరీరాలతో ఇద్దరిగా ఉన్న వ్యక్తుల జీవితంలో ఎవరి సమయం వారిదే! ఎవరి జీవితం వారిదే! ఇది తెలుసుకోలేకపోవడం వల్ల ఒకరి జీవితమే మిగులుతుంది. రెండోవారికి జీవితమే లేకుండా పోతుంది.**



"లలితకి దైవకార్యాల్లో పాల్గోకూడని సమయమట! అందుకని శ్రీధర్ తమ్ముడు- మరదలు పీటలమీద కూర్చున్నారట" అన్న మా అత్తయ్య మాట చెవిన పడింది. బాగానే జాగ్రత్తపడ్డాడు శ్రీధర్.

నేను స్నిగ్ధ పక్కనే ఉన్నాను. అది నిజంగానే మెరుపులా ఉంది. నా రెండు కళ్ళూ సరిపోవడంలేదు చూడ్డానికి. నెమ్మదిగా అందరం దాన్ని మోహన్ దగ్గిరికి మంచి ముహూర్తంలో తీసుకు వచ్చాం. మంత్ర ప్రభావితమైన హృదయాలతో అతని చేతుల్లో పెడుతున్నాం.

"ధర్మేచ, అర్థేచ, కామేచ నాతిచరామి" అన్న మంత్రం మోహన్‌చేత చెప్పిస్తున్నారు నా పెళ్ళి చేయించిన గురువుగారు. ఆ మంత్రాన్ని భక్తితో వింటూ పులకాంకిత అవుతోంది స్నిగ్ధ.

మరి మోహన్?

స్నిగ్ధ- అతని హృదయాన్ని మంత్రజాలమంటి తన వ్యక్తిత్వంతో ప్రభావితం చెయ్యాలని నా నిండుమనసుతో ఆశీర్వదిస్తున్నాను.

వ్యక్తిత్వమన్నమాట ఈ సమయంలో స్ఫురించగానే నా మనస్సు ఒక్కసారి వణికింది. స్త్రీ తన ఉనికిని నిలుపుకోవడమన్నది ఎంత కష్టసాధ్యమో ప్రేమించే హృదయమున్నవాళ్లకు మాత్రమే తెలుస్తుంది. ప్రేమించడమంటే వ్యక్తిత్వాన్ని వదులుకోవడమనే అనుకుంటుంది స్త్రీ. ఎప్పుడూ అతనితోటి ఐక్యంకోసం ఛాయగా మారిపోవాలి అని అనుకుంటోంది. దాంతోనే ఆమె కాంతివిహీన అయిపోతోంది.

అలాకాదు! ఈ విషయంలోని నా అనుభవం స్నిగ్ధకి పాఠం కావాలి. స్నిగ్ధ 'స్వయంప్రభ'గా మోహన్ జీవితాన్ని మెరిపించడం నా కళ్లముందు ఇప్పుడు కదలాడుతోంది.

చల్లనిగాలి తాకిన మేఘంలా ఉంది ఇప్పుడు నా మనసు.

## షూటింగ్‌లతో బిజీబిజీ: అమీషా



"నా వ్యక్తిగత జీవితానికి రోజుకు రెండు గంటలయినా కేటాయించే పరిస్థితి లేదు" అని వాపోతోంది అమీషా పటేల్. బాలీవుడ్‌లో బిజీ తారగా ఉన్న అమీషా పర్సనల్ లైఫ్ అంటూ లేకుండా పోతుందని దిగులుగా చెబుతోంది. షూటింగ్‌ల కోసం విమానాలు ఎక్కడం, దిగడంతోనే సరిపోవడంతో ఎవరితోనైనా కాస్సేపు హాయిగా గడిపే టైమ్ ఎక్కడుందని బెంగపడుతోంది. బిజీ షెడ్యూల్ కావడం వల్ల స్నేహాల్ని కూడా కొనసాగించడం, టచ్‌లో ఉండటం అస్సలు కుదరటం లేదని అమీషా అంటోంది. "ఈ మధ్యన ముంబాయిలో ఉండక చాలా రోజులైంది. షూటింగ్‌ల కోసమని మారిషస్, స్కాట్లాండ్, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, హైదరాబాద్‌లకు ఎక్కువగా తిరుగుతుండటంతో ఇంటివద్ద కూర్చుని తీరిగ్గా గడిపే అవకాశం కూడా రావడం లేదు" అంటోంది అమీషా. వయసు మీద ఉన్నప్పుడే కష్టపడాలన్న స్పృహ అమీషాకు ఉంది కాబోలు. అందుకే వచ్చిన ఆఫర్లు అన్నిటికీ ఒప్పేసుకొని ఇప్పుడు పర్సనల్ లైఫ్ లేదంటూ దిగులు పడుతుందని బాలీవుడ్‌లో గుసగుసలు పోయేవారు లేకపోలేదు.